నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23-7-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 285 పేజీలు: 4 వెల: రూ.1/-

సహాయక చర్యలు చేపట్టండి

వరదలపై కలెక్టర్లకు సీఎస్ కీలక సూచన

హైదరాబాద్ , జులై 22:గోదావరి పరీవాహక జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల అధికారులతో డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో పరిస్థితిపై ఆరా తీశారు. ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా యుద్ధ ప్రాతిపదికన సహాయక, పునరావాస చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉంటూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించాలని ఆదేశించారు. చెరువులకు గండ్లు పడుకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.

తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సీఎస్ హామీ ఇచ్చారు. ఈ మేరకు వివరాలను విపత్తు నిర్వహణ ప్రత్యేక

కార్యదర్శి రాహుల్ బొజ్జాకు వివరాలు అందివ్వాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్, లెఫ్టినెంట్ కర్నల్ కమల్‌దీప్, ఫైర్ డీజీ ఎస్‌కే జైన్, పీఆర్ అండ్ ఆర్‌డీ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బోజ్జా, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, పీఆర్ కమిషనర్ రఘునందన్ రావు, ఈఐఎన్‌సీ మురళీధర్ రావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి దామోదర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాలు ఇవే..

హైదరాబాద్ , జులై 22:వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో తెలంగాణవ్యాపత్గా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనానికి అనుభందంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటున 7.6 కి మీ ఎత్తు వరకు కొనసాగుతోంది. దీని ప్రభావంతో వచ్చే 48 గంటల పాటు తెలంగాణలో తేలికపాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపిం ది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

మరోవైపు సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, వరంగల్, హన్మకొండ, అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలతోపాటు పలుచోట్ల ఉరుములు, మెరుపుల అలజడి ఉంటుందని, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

గోదావరికి వరద ఉధృతి.. మందస్తు చర్యలకు సీఎం ఆదేశం

హైదరాబాద్ , జులై 22:రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎస్సారెస్పీ ఎగువ నుంచి గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగుతున్నందున యుద్ధ ప్రాతిపదికన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. బాల్కొండ నియోజకవర్గంతో పాటు నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, తక్షణమే పర్యవేక్షించాలని ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని సీఎం ఆదేశించారు. ఇప్పటికే నిర్మల్ పట్టణం నీటమునిగిందని అక్కడికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తక్షణమే పంపాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను కేసీఆర్ ఆదేశించారు.

ప్రజలకు ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు

ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గోదావరి పరీవాహక ప్రాంత జిల్లాల కలెక్టర్లను, ఎస్పీలను, రెవెన్యూ అధికారులు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలందరూ ఇండ్లల్లోంచి బయటకు రావద్దని సీఎం కేసీఆర్ సూచించారు. వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్ననేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సీఎం సూచించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరితో పాటు కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో.. మన రాష్ట్రంతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయని సీఎం కేసీఆర్ తెలిపారు. ఆయా రాష్ట్రాల వాళ్లు కూడా అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తుతున్నారని, ఈ నేపథ్యంలో తెలంగాణలోకి వరద ఉధృతి పెరగనున్నదని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నదీ

పరీవాహక ప్రాంతాల్లోని తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ తమ జిల్లాల్లో, తమ తమ నియోజకవర్గాల్లో వుంటూ ఎప్పటికప్పుడు వరద పరిస్థిని సమీక్షిస్తూ వుండాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ ప్రాంతాల అన్నిస్థాయిలలోని టీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్ కు అందుబాటులో ఉంటూ పరిస్థితులను సమీక్షిస్తుండాలన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లోని అధికారులతో పాటు మొత్తం టీఆర్ఎస్ పార్టీ నాయకత్వం అంతా గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి మంత్రుల దాకా, పార్టీ కార్యకర్తలు నేతలంతా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారు.

ఈ ప్రాంతాల్లోని ప్రజలు కూడా బయటకు వెళ్లకుండా ఇండ్లల్లో వుండడమే క్షేమమని సీఎం పునరుద్ఘాటించారు. రానున్న రెండు రోజులు అత్యంత భారీ స్థాయిలో వర్షాలు కురిసే పరిస్థితిల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వుంటూ జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులందరూ అత్యంత అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 8 గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , జులై 22:నిజామాబాద్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎనిమిది గేట్లను అధికారులు గురువారం ఎత్తివేశారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

ఎనిమిది గేట్లను ఎత్తి దిగు వకు 50వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

ఈ క్రమంలో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4,32,325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1090 అడుగులు ఉన్నది.గరిష్ఠ నీటినిల్వ 90 టీఎం

సీలు కాగా.. ఇప్పుడు 84.810 టీఎంసీల నీరు ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి జూలై నెలాఖరులోపే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. గతేడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీలో కేవలం 33 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లుగా అధికారులు చెప్పారు.

ప్రస్తుతం అతి భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి దాదాపు 84 టీఎంసీలకు చేరుకుందని చెప్పారు. ఎగువ నుంచి భారీ గా వరద వస్తున్న క్రమంలో అధికారులు అప్రమత్తమై ముందస్తుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గేట్లను ఎత్తి, దిగువకు నీటిని వదులుతున్నారు.

మంత్రి చేతుల్లోంచి పేపర్లు లాగి.. చింపేసిన టీఎంసీ ఎంపీలు

న్యూఢిల్లీ, జులై 22: రాజ్యసభలో ఇవాళ గందరగోళం నెలకొన్నది. పెగాసస్ స్పైవేర్ అంశంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన చేస్తున్న సమయంలో.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు అనుచితంగా వ్యవహరించారు. మంత్రి వైష్ణవ్ చేతుల్లోంచి స్టేట్‌మెంట్ పేపర్లు లాగారు. ఆ తర్వాత ఆ పేపర్లు చింపివేసి .. వెల్‌లోనే వెదజల్లారు. టీఎంసీ ఎంపీల వైఖరిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ఎంపీల ప్రవర్తన తీరును డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ఖండించారు. గందరగోళం నడుమ ఆయన సభను రేపటికి వాయిదా వేశారు. గతంలోనూ టీఎంసీ ఎంపీలు.. నూతన రైతు చట్టాలను ప్రవేశపెడుతున్న సమయంలో.. చైర్ మైక్ లాగేసిన విషయం తెలిసిందే.

తాజాగా టీఎంసీ ఎంపీ శంతను సేన్.. మంత్రి వైష్ణవ్ చేతుల్లోంచి పేపర్లు లాగేసినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పురతి, ఎంపీ శంతను సేన్ మధ్య మాటల ఘర్షణ కొనసాగింది. పెగాసస్ ప్రాజెక్టు రిపోర్ట్‌ను చదువుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. టీఎంసీ ఎంపీల ప్రవర్తనను బీజేపీ ఎంపీ స్వపన్‌దాస్ గుప్తా ఖండించారు. మంత్రి చేతుల్లోంచి పేపర్ లాగేసిన అంశాన్ని ప్రశ్నించగా.. ఎంపీ ఎంపీ సుకేందు శేఖర్ రాయ్ సమాధాన్ని దాటవేశారు.

వరదలపై మహారాష్ట్ర సీఎం అత్యవసర సమావేశం..!

ముంబై, జులై 22:: మహారాష్ట్ర రాజధాని ముంబైలో వరద పరిస్థితిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రత్నగిరి, రాయ్‌గఢ్ జిల్లాల్లో వరదలు తీవ్ర ప్రభావం చూపడంతో ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ఆయా జిల్లాల్లో పరిస్థితి గురించి అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భ ంగా విపత్తు నిర్వహణ విభాగాలకు, సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీచేశారు. వరదల నేపథ్యంలో అందరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలని సూచించారు. ఈ వివరాలను మహారాష్ట్ర సీఎం కా ర్యాలయ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. కాగా, మహారాష్ట్ర రాజధాని ముంబైని గత 24 నుంచి భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమ య్యాయి. కొన్ని చోట్ల భారీగా నిలిచిన వరద నీరు కారణంగా జనజీవనం స్తంభించిపోయింది.

డాక్టర్ ఎల్లూరి శివారెడ్డికి దాశరథి అవార్డు ప్రదానం

హైదరాబాద్ , జులై 22:తెలుగు వర్సిటీ మాజీ వీసీ, సాహితీవేత్త డాక్టర్ ఎల్లూరి శివారెడ్డికి సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రదానం చేశారు. రవీంద్ర భారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ అవార్డు కింద సైటేషన్‌తో పాటు రూ.1, 01,116 నగదును ఎల్లూరి శివారెడ్డికి అందజేశారు. మహాకవి దాశరథి సేవలను చిరస్మరణీయం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం సాహిత్యరంగంలో విశేషంగా కృషిచేసిన వారికి ప్రతిఏటా దాశరథి జయంతి అయిన జూలై 22న అవార్డు ఇస్తున్నది.

ముక్కోటి వృక్షార్చన విజయవంతం చేయాలి : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , జులై 22:మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 24న ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ముక్కోటి వృక్షార్చనను న విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అడవుల పెంపకానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, మానవుల మనుగడకు చెట్లే ఆధారమన్నారు. భూభాగం లో 33 శాతం పచ్చదనం ఉండాలనే లక్ష్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి తెలంగాణ హరితహారం అనే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా గత ఐదేళ్ల కాలంలో 220 కోట్ల మొక్కలను నాటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 21 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ముక్కోటి వృక్షార్చనలో నాటిన మొక్కలను సంరక్షించడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు.24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి జరిగే ముక్కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు,యువత రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలను నాటాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వరంగల్ జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పటిష్టంగా లా అండ్ ఆర్డర్ -హోం మంత్రి మహముద్ అలీ

హైదరాబాద్ , జులై 22: రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తున్నామని, హీనమైన నేరాలు చేసేవారిపై, కరడుగట్టిన నేరస్తులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నామని హోంమంత్రి మహముద్ అలీ తెలిపారు. కొండాపూర్‌లోని ఎనిమిదో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 466 మంది ఎఆఖఅబ ల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమానికి హోంమంత్రి మహముద్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మహముద్ అలీ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఏర్పడితే నక్సలిజం పెరుగుతుందని కొందరు మాట్లాడారు. కానీ నక్సలిజాన్ని అరికట్టామని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలు సమర్థవంతంగా అమలైనప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పోలీసు శాఖను ఆధునీకరించారు. పోలీసు శాఖకు నూతన వాహనాలను సమకూర్చామన్నారు. దీంతో నేరం జరిగిన ప్రదేశానికి సిటీలో అయితే 5 నిమిషాల్లో, జిల్లాల్లో అయితే 8 నిమిషాల్లో పోలీసులు చేరుకుంటున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను, తెలంగాణను సురక్షితంగా ఉంచేందుకు అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.మహిళల రక్షణకు 331 షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల మహిళలకు వేధింపులు తగ్గాయి. మహిళల భద్రతకు ప్రత్యేకంగా వుమెన్ సెఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నేరాల అదుపునకు రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షలకు పైగా సీసీటీవీ కెమెరాలు అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్ 16వ స్థానంలో ఉందన్నారు. దేశంలోని మొత్తం సీసీటీవీ కెమెరాల్లో, మన రాష్ట్రంలోనే 64 శాతానికి పైగా ఉన్నాయని హోంమంత్రి మహముద్ అలీ పేర్కొన్నారు.

భారీ వర్షాలకు మునిగిపోయిన నిర్మల్ పట్టణం

నిర్మల్, జులై 22: తెలంగాణ అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో జలాశయాలకు వరద పోటెత్తింది. గడిచిన 24 గంటల్లో నిర్మల్ జిల్లాలో వాన దంచికొట్టింది. ఆ జిల్లాలోని నర్సాపూర్‌లో అత్యధికంగా 245 మి.మీ. వర్షపాతం నమోదైంది. తెలంగాణ వ్యాప్తంగా 44.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 115.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒక్క నిర్మల్ జిల్లాలోనే 204 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూన్ 1వ తేదీ నుంచి జులై 22 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 474.3 మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

నిర్మల్‌లో దంచికొట్టిన వాన.. నర్సాపూర్‌లో 245 మి.మీ. వర్షపాతం

పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. నిర్మల్ పట్టణంలోని మంజూలాపూర్, మంచిర్యాల చౌరస్తా, సిద్దాపూర్, సోఫీ నగర్ కాలనీలను మంత్రి పరిశీలించారు. జోరు వానలోనే పలు కాలనీ లలో పర్యటిస్తూ అధికారులకు సూచనలిస్తూ.. మంత్రి ప్రజలకు భరోసా కల్పించారు. కాలనీ వాసులతో వారి సమస్యలపై చర్చించారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మల్ చరిత్రలో ఎన్నడు కూడా ఇంతటి వర్షం కురవలేదన్నారు. పలు కాలనీలు జలమ య్యాయని, ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు. నిత్యావసరాలు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజలు కూడా బాధితులకు సహాయం చేయాలని కోరారు. జిల్లా అధికారులతో మంత్రి కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ వర్షం ఇలాగే కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు చర్చలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

చార్మినార్‌లో అత్యధిక వర్షపాతం నమోదు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ ముసురు ఆగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అయితే భారీ వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో చార్మినార్‌లో అత్యధికంగా 26.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి జులై 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో 73 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. ఈ తేదీల మధ్యలో నగరంలో 388.9 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మరో మూడు రోజులు భారీ వర్షాలు

తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ప్రకారం.. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య అల్పపీడన ద్రోణి బలహీనపడింది. వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఆవర్తనం కొనసాగుతుందని చెప్పింది.

సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉందని పేర్కొంది. వాయువ్య బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెప్పింది. వీటి ప్రభావంతో రాగల మూడు రోజుల్లో తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ ఉత్కృష్టతపై ఆసవదు
సత్కృష్టమె దేశమును సంతోషముగా
నత్కృమ నెరుగక నాడిన-ని
నత్కృత కైగాలుచు చుంటి " కల్పన్ లక్ష్మీనే!!

(జులై 23 నేతాజీ సైన్యంలో మహిళాకల్పల్ -రాధశ్రీ

'లక్ష్మి' వర్ధంతి...) సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

త్రివర్ణ పతాక రూపశిల్పి తెలుగు తేజం పింగళి వెంకయ్య

(22 జూలై 'జాతీయ పతాక ఆమోద దినోత్సవం' సందర్భంగా)

త్రివర్ణ పతాక రెపరెపలు ప్రతి భారతీయ పౌరుడి హృదయంలో దేశభక్తిని జాగృతం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మన దేశ ప్రతినిధిగా భారతీయ సనాతనతత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాట యోధుల ప్రాణ త్యాగాలను గుర్తు చేస్తూనే పౌరులలో దేశ భక్తి, విశ్వాసాలను ఇనుమడింపజేస్తుంది. విద్యార్థిగా తెలుగు తేజం పింగళి వెంకయ్య 1916లో రూపొందించిన 30 రకాలైన పతాకాలు ప్రతిపాదించారు. వీటిలోంచి కాషాయ, ఆకుపచ్చ చారలు కలిగిన పతాకాన్ని 1921లో మహాత్మాగాంధీకి అందించడం జరిగింది. నాటి జెండాలోని కాషాయ వర్ణం హిందువులను, ఆకుపచ్చ రంగు ముస్లిమ్‌లను చూచించేలా రూపొందించారు. గాంధీ సూచనల మేరకు కాషాయ, ఆకుపచ్చ చారల మధ్య తెలుపు వర్ణపు పట్టీని చేర్చారు. మే 1923 నాగపూర్ నిరసన కార్యక్రమాల్లోనే కాకుండా రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సుభాష్ చంద్ర బోస్ కూడా ఈ జెండాను వాడినట్లు చరిత్ర చెబుతోంది. లాలా హన్స్ రాజ్ సలహాతో తెలుపు వర్ణ చార మధ్యలో స్పిన్నింగ్ రాట్నం అమర్చడంతో భారతీయులు తమ వస్త్రాలను తామే తయారు చేసుకుంటారనే స్వావలంభన భావనను వ్యక్తపరిచినట్లు అయ్యింది. దీనిని ఆగష్టు 1931 ఆల్ ఇండియా కాంగ్రేస్ సమావేశంలో ఆమోదించారు. ఖాదీ నూలుతో చేయబడిన నేటి జాతీయ పతాకపు కొలతలు 2:3 నిష్పత్తితో ఉంటూ, పైభాగాన ఉన్న కాషాయం, మధ్యలో తెలుపు, కింది భాగాన ఆకు పచ్చ వర్ణాలు సమాన వైశాల్యాలతో అడ్డం చారలుగా ఉన్నాయి. కాషాయం త్యాగం / ధైర్యాలను, తెలుపు శాంతి / స్వచ్ఛత / సత్యాలను, ఆకుపచ్చ రంగు నమ్మకం / సంపద / ధైర్యసాహసాలను సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం జెండా మధ్యలో అమర్చిన స్పిన్నింగ్ రాట్నానికి బదులుగా 24-చువ్వలు కలిగిన నీలి వర్ణపు అశోకుడి ధర్మ చక్రం చేర్చారు.

ప్రస్తుత రూపంలో ఉన్న భారత జాతీయ పతాకాన్ని 23 జూన్ 1947న రాజెంద్ర ప్రసాద్, మౌళానా అబుల్ కలాం ఆజాద్, రాజగోపాలాచారి, అంబేద్కర్, సరోజినీ నాయుడు లాంటి పలువురితో కూడిన కమిటీ సమావేశంలో ఎంపిక చేయగా, 22 జూలై 1947న జరిగిన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంలో భారత జాతీయ జెండాను ఆమోదించడంతో పాటు ఈ త్రివర్ణ పతాకాన్ని భారత జాతీయ కాంగ్రేస్ సమావేశంలో అధికారికంగా ఎగురవేశారు. ఆ రోజు నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 22 జూలైన 'భారత జాతీయ పతాక స్వీకరణ/ఆమోద దినం' పాటించబడుతున్నది. భారత జాతీయ పతాక ఆమోద దినం సందర్భంగా ప్రభుత్వ సమావేశాలు, పతాక రెపరెపల నడుమ జాతీయ గీతాలాపనలు, రక్షణరంగ త్రివిధ దళాల సేవలు కొనియాడడం, కవాతులు, జెండా చేతబూని ర్యాలీలు, దేశభక్తిని నింపే కార్యక్రమాలు నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. దేశంలో సంపదలు, శాంతి స్థాపన, గత త్యాగాలకు మరోరూపంగా నిలుస్తున్న భారత జాతీయ జెండా ప్రతిష్ట, ప్రాభవాలను ఇనుమడింప చేయడానికి ప్రతి ఉత్తమ పౌరుడు కృషి చేయాల్సిందే. మన జాతీయ పతాకం పట్ల అచంచల విశ్వాసాన్ని వ్యక్తీకరిస్తూ, మనం అక్షరాల తత్‌పదానుగాములమని ఎన్నటికీ మరువరాదు. మనలో ప్రతి ఒక్కరం జాతీయ పతాక వైభవాలను ఇతోధికం చేయడానికి అవిరళ కృషి చేద్దాం. భారతీయ పౌరుల సత్‌కర్మలతోనే మన పతాకం సభ్యదేశాలలో సమున్నతంగా, సగర్వంగా ఎగురుతుంది. సువర్ణాక్షరాల్లో లిఖించబడిన పతాక పవిత్ర చరిత్ర మన దేశానికి సత్కీర్తిని సమకూర్చుతూ, ఉత్తమ కృషి సలుపడానికి మనందరికి ప్రోత్సాహ ప్రోద్బలాలను అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. జైహింద్, జై జవాన్, జైకిసాన్, జైవిద్వాన్.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఎన్.జి.ఎం.ఏ. ను సందర్శించిన - కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 22:కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రులు శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, శ్రీమతి మీనాక్షి లేఖీ లతో కలిసి, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, ఈ రోజు న్యూఢిల్లీ లోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్.జి.ఎం.ఎ) ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో - కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి, శ్రీ రాఘవేంద్ర సింగ్; ఎన్.జి.ఎం.ఎ. డైరెక్టర్ జనరల్ శ్రీ అద్వైత గడనాయక్; డైరెక్టర్, శ్రీమతి తెమ్సునారో జమీర్ తో పాటు, ఎన్.జి.ఎం.ఎ. కు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమృతా షెర్గిల్, రవీంద్రనాథ్ ఠాగూర్, రాజా రవివర్మ, నికోలస్ రోరిచ్, జమిని రాయ్, రామ్ కింకర్ బైజ్ వంటి సుప్రసిద్ధ కళాకారుల కళాఖండాల ప్రదర్శన కోసం పునర్నిర్మించిన జైపూర్ హౌస్ ను మంత్రులు సందర్శించారు. వారు తాత్కాలిక ఎగ్జిబిషన్ హాల్ మరియు ఎగ్జిబిషన్ హౌస్ (నూతన విభాగం) ను కూడా సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ మరియు ఇతర కళాకృతులను పరిశీలించారు. గ్యాలరీలో కళాత్మకంగా అమర్చిన నంద్ లాల్ బోస్ యొక్క పెయింటింగ్స్ మరియు హరిపురా ప్యానెల్స్ ప్రదర్శనపై మంత్రులు ప్రత్యేక ఆసక్తి చూపించారు.

వర్చువల్ మ్యూజియం, ఆడియో-విజువల్ యాప్ తో సహా ఎన్.జి.ఎం.ఏ. నిర్వహిస్తున్న యొక్క వివిధ కార్యక్రమాలను, సహాయ మంత్రులతో కలిసి, శ్రీ కిషన్ రెడ్డి, ఈ సందర్భంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా, శ్రీ కిషన్ రెడ్డి, విలేకరులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా, "ఆజాదీ-కా-అమృత్-మహోత్సవ్" నేపథ్యంలో, ఈ జాతీయ ఆధునిక ఆర్ట్ గ్యాలరీ పునరుద్ధరించబడుతోందని, తెలియజేశారు. పునర్నిర్మాణం, పునర్వ్యవస్థీకరణ పనులు పూర్తయిన తరువాత, నూతనంగా రూపుదిద్దుకున్న ఎన్.జి.ఎం.ఏ. ప్రజల సందర్శన కోసం, దేశానికి పునరంకితం కానుందని, కేంద్ర మంత్రి వివరించారు. గ్యాలరీలో ప్రదర్శించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పెయింటింగ్ లు మరియు కళాకృతులను సేకరించడం జరుగుతోంది. ఈ సేకరణ దేశ భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంటుంది. అతి త్వరలో దేశంలో ఉత్తమ ఆధునిక ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక సేకరణల తో దేశ రాజధానిలో సిద్ధంగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయిన తరువాత, ప్రజల సందర్శన కోసం ప్రారంభించనున్నట్లు, ఆయన వెల్లడించారు.

ఆధునిక మరియు సమకాలీన భారతీయ కళాకృతులను కలిగి ఉన్న నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్.జి.ఎం.ఏ), ప్రపంచంలోనే ఆధునిక కళాకృతులు కలిగిన అతిపెద్ద మ్యూజియం లలో ఒకటి.

దేశంలో ఆధునిక కళను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎన్.జి.ఎం.ఏ. స్థాపించబడింది. ఇది 1850 సంవత్సరం నుండి కళాకృతులను సేకరించి, సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్.జి.ఎం.ఏ. చేపట్టిన కళాకృతుల సేకరణ చాలా విస్తారమైనది, పరిశీలనాత్మక మైనది. ఎన్.జి.ఎం.ఏ. సేకరించిన కళ్ళకృతులు సూక్ష్మ చిత్రాల నుండి ఆధునిక చిత్రాలు, సమకాలీన కళా ఖండాల వరకు విస్తరించి ఉన్నాయి.

కొనుగోళ్ళు, బహుమతులు వంటి వివిధ వనరుల ద్వారా, ఎన్.జి.ఎం.ఏ. అనేక యూరప్, సుదూర తూర్పు దేశాలకు చెందిన కళాకారులు రూపొందించిన కళాఖండాలను కూడా సేకరించింది. 18వ, 19వ శతాబ్దాలలో భారతదేశాన్ని సందర్శించిన యూరప్ కళాకారుల చిత్రాలు, కళాఖండాలతో పాటు, అపురూపమైన భారతీయ దృశ్యాల వంటివి అనేకం ఈ సేకరణలో ఉన్నాయి.

మానవులపై మొట్టమొదటి సారిగా నమోదైన బర్డ్ ఫ్లూ కేసుపై హర్యానాలోని ఐ.డి.ఎస్.పి. రాష్ట్ర నిఘా విభాగం (ఎస్.ఎస్.యు)

న్యూఢిల్లీ, జులై 22:2021 జూన్ లో ఒక మగ పిల్లవానికి ఏ.ఎం.ఎల్. సోకినట్లు, ఢిల్లీ లోని ఎయిమ్స్, చిన్న పిల్లల వైద్య విభాగంలో నిర్ధారణ అయింది. ఏ.ఎం.ఎల్. కోసం ఇండక్షన్ థెరపీ తర్వాత, ఆ పిల్లవానికి, జ్వరం, దగ్గు, కొరిజా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు వృద్ధి చెందాయి. అతనికి న్యుమోనియా మరియు షాక్ తో జ్వరసంబంధమైన న్యూట్రోపెనియాతో ఏ.ఎం.ఎల్.గా నిర్ధారించారు. ఇది ఏ.ఆర్.డి.ఎస్. గా పురోగమిస్తుంది. 2021 జూలై, 2వ తేదీన అతడ్ని, న్యూ ఢిల్లీ లోని ఎయిమ్స్‌లో చేర్చారు. నేక అవయవాలు పనిచేయకపోవడంతో ఆ బాలుడు చాలా బాధపడి, 2021 జూలై, లో 2021 న మరణించాడు.

ఎయిమ్స్ కు చెందిన మైక్రోబయాలజీ విభాగం 2021 జూలై 7 మరియు 11 తేదీల్లో శ్వాసకోశ నాళం పరీక్ష కోసం బ్రోంకోఅల్వియోలార్ లావేజ్ (బి.ఎ.ఎల్) ను అందుకుంది. ఈ నమూనాను పరీక్షిస్తే, ఇన్-ఫ్లూయెంజా-ఎ మరియు ఇన్-ఫ్లూయెంజా-బి రెండింటికీ పాజిటివ్ గా తేలింది. ఇది సార్స్-కోవ్-2 తో పాటు ఇతర శ్వాసకోశ వైరస్ లకు కూడా నెగిటివ్ గా తేలింది. హెచ్.1.ఎన్.1 మరియు హెచ్.3.ఎన్.2. లకు అందుబాటులో ఉన్న కారకాలతో ఎయిమ్స్ వద్ద పరీక్షిస్తే, ఇన్-ఫ్లూయెంజా-ఎ అనిశ్చితంగా ఉంది. అందువల్ల, ఈ నమూనాలను, 2021 జూలై 13వ తేదీన ఎన్.ఐ.వి. కి పంపారు.

ఈ రెండు నమూనాలు, ఎన్.ఐ.వి. వద్ద, ఇన్-ఫ్లూయెంజా-ఎ మరియు ఇన్-ఫ్లూయెంజా-బి లతో పాటు ఇన్-ఫ్లూయెంజా-ఎ సీజనల్ (హెచ్.1.ఎన్.1, హెచ్.1.ఎన్.1. పి.డి.ఎం.09 మరియు హెచ్.3.ఎన్.2), సీజనల్ కాని ఏవియన్ సబ్-టైప్స్ (హెచ్.5, హెచ్.7, హెచ్.9, హెచ్.10) రియల్ టైమ్ పి.సి.ఆర్. చేత పరీక్షించబడ్డాయి. ఫలితం ఏ/హెచ్.5 మరియు టైప్-బి. విక్టోరియా లైనేజ్ కి, ఈ నమూనా సానుకూలంగా ఉన్నట్టు తేలింది. మొత్తం జీనోమ్ సీక్వెన్సింగ్ మరియు వైరస్ ఐసోలేషన్ ప్రక్రియలో ఉన్నాయి.పూణే లోని ఎన్.ఐ.వి. ప్రయోగశాల నివేదిక తో పాటు వచ్చిన సమాచారాన్ని, ఢిల్లీ లోని ఎన్.సి.డి.సి. కి 2021 జూలై 16వ తేదీ శుక్రవారం రోజున, ఢిల్లీ లోని ఎయిమ్స్ నుండి అందుకుంది. ఈ కేసుపై అంటువ్యాధులకు సంబంధించిన దర్యాప్తును ప్రారంభించడం కోసం, ఈ సమాచారాన్ని, హర్యానాలోని ఐ.డి.ఎస్.పి. రాష్ట్ర నిఘా కేంద్రం (ఏ.ఎస్.యు) కు తెలియజేయడం జరిగింది. ఈ విషయాన్ని పశు సంవర్ధక శాఖకు కూడా నివేదించారు. ఎన్.సి.డి.సి. కి చెందిన సాంక్రమిక వ్యాధి నిపుణులు, సూక్ష్మజీవుల శాస్త్ర నిపుణులతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. అంటువ్యాధులపై అంచనా నివేదిక రూపొందించడానికి ఈ బృందం వెంటనే న్యూఢిల్లీ, గురుగ్రామ్ లలోని ఎయిమ్స్ సంస్థలను సందర్శించింది. ఈ దర్యాప్తులో రాష్ట్ర ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

రోగికి చికిత్స చేస్తున్న వైద్యులు మరియు నర్సుల బృందాన్ని కూడా 2021 జులై, 16వ తేదీ నుండి పర్యవేక్షిస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, వారికి ఇంతవరకు, ఎటువంటి శ్వాసకోశ సంబంధమైన వ్యాధి వంటి అనారోగ్య లక్షణాలు కనబడలేదు. కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత పరిచయస్తులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులపై నిఘా కొనసాగుతోంది. వీరిలో ఎవరికీ వ్యాధి లక్షణాలు లేవు. ఏదైనా రోగ లక్షణాలు కనుక్కోడానికి చేసే, కాంటాక్ట్ ట్రేసింగ్ ప్రక్రియను, వ్యాధి సోకిన వారు నివసించిన ప్రాంతంలోనూ, చికిత్స పొందిన ఆసుపత్రి లోనూ, చురుకుగా నిర్వహిస్తున్నారు. ఏదైనా రోగ లక్షణాలు ఉన్న కేసు వివరాలను వెంటనే, ఆరోగ్యశాఖ అధికారులకు నివేదించ వలసిందిగా కోరుతూ, సాధారణ ప్రజల కోసం ఐ.ఈ.సి. కార్యకలాపాలు నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం, ఈ ప్రాంతంలో, రోగ లక్షణాలు కలిగిన వ్యక్తులు ఎవరూ లేరు.

ఈ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ అనుమానంతో ఏ కేసు నమోదు కాలేదని పశు సంవర్ధక శాఖ నిర్ధారించింది. కాగా, ముందుజాగ్రత్త చర్యగా 10 కిలోమీటర్ల పరిధిలో నిఘా పెంచింది. దీనితో పాటు, పశుసంవర్ధక శాఖ, రాష్ట్ర ప్రభుత్వ నిఘా విభాగాలను కలుపుకుని, ఎన్.సి.డి.సి. అంటు వ్యాధులపై దర్యాప్తు జరుగుతోంది మరియు తగిన ప్రజారోగ్య చర్యలను ప్రారంభించింది.

పండించే పంటకు పార్టీ రంగులు పులుముతారా?: పవన్

అమరావతి, జులై 22:ఏపీ ప్రభుత్వంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. ఏపీలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, వాటికి సంబంధించిన లెక్కలను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని పవన్ ప్రశ్నించారు. ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి ఈ వివరాలను ఎందుకు తొలగించారో రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని పవన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు ఎందుకు చెల్లించలేదని ఏపీ ప్రభుత్వాన్ని పవన్ నిలదీశారు. జూలై నెలాఖరులోగా ప్రతి గింజకు డబ్బు చెల్లించాలని.. లేకపోతే రైతుల కోసం పోరాడతామని హెచ్చరించారు. ప్రభుత్వం రైతులకు రూ.3వేల కోట్ల బకాయి పడిందన్నారు. రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి ఉభయ గోదావరి జిల్లాలలోనే రూ.1800 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో తాను రైతుల కోసం సౌభాగ్య దీక్ష చేపడితేనే ప్రభుత్వం దిగి వచ్చి రైతులకు సొమ్ములు జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జొన్న, మొక్కజొన్న కొనుగోలు విషయంలో రైతులను పార్టీలవారీగా విడదీయడం దురదృష్టకరమన్నారు. అధికార పార్టీకి మద్దతుగా ఉన్నవారి నుంచే పంటను కొనుగోలు చేస్తున్నారని పవన్ మండిపడ్డారు. పండించే పంటకు, తినే తిండికి పార్టీ రంగులు పులమడం దిగజారుడుతనానికి నిదర్శనమని పవన్ విమర్శించారు.

స్నాక్స్ అమ్ముతూ రూ.కోట్లు సంపాదిస్తున్న చిరు వ్యాపారులు

హైదరాబాద్ , జులై 22:టీ, సమోసా, పాన్లు, పానీపూరీలు అమ్ముతూ ఎవరైనా రోజుకు ఎంత సంపాదిస్తారు.. మహా అయితే రూ.2వేలు లేదా రూ.5వేలు. కానీ ఉత్తరప్రదేశ్‌లో అలాంటి చిరు వ్యాపారులు.. ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. అనుమానం వచ్చి ఆయా వ్యాపారాలు చేసే వారి ఇళ్లపై దాడులు చేసిన ఐటీ అధికారులకు మతిపోయింది. ఒక్కొక్కరి ఆస్తి వందల కోట్లలో ఉండటంతో అధికారులు నివ్వెరపోయారు.

కాన్పూర్‌లో స్నాక్స్ అమ్ముకునే 256 మంది కోటీశ్వరులని జీఎస్టీ అధికారుల పరిశీలనలో తేలింది. వీరిలోని చాలా మంది వద్ద ఖరీదైన కార్లు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్కరి ఇంట్లో కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు దొరికాయి. వీరు ఇప్పటివరకు ఒక్క పైసా పన్ను చెల్లించకుండా వ్యాపారాలు నడుపుకుంటున్నారని అధికారులు వెల్లడించారు. వీరి వద్ద మొత్తం రూ.375 కోట్ల సంపద ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

డాక్టర్ అనిల్ కాకోడ్కర్ నేతృత్వంలో రూపొందించిన అంతర్జాతీయ ఎస్ అండ్ టి సహకారంపై నివేదిక విడుదల

న్యూఢిల్లీ, జులై 22:ప్రధానమంత్రి మోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ సాధించడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్యమని కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) సైన్స్ ఉ టెక్నాలజీ; సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) ఎర్త్ సైన్సెస్;ఎంఓఎస్ పిఎంఓ, సిబ్బంది, ప్రజా మనోవేదనలు, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. స్వావలంబన విశ్వాసం తరువాతి తరానికి తగ్గట్టుగా ఉంటుందని, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అత్యుత్తమ వనితీరును ఆకర్షించడంలో ఇది సహాయపడుతుందని అన్నారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్మన్ డాక్టర్ అనిల్ కాకోడ్కర్ నేతృత్వంలో తయారుచేసిన అంతర్జాతీయ ఎస్ అండ్ టి సహకారంపై సమీక్ష కమిటీ నివేదికను విడుదల చేసిన తరువాత డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు.సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించినంతవరకు భారతదేశం ఇప్పటికే ప్రపంచ శక్తి అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అయితే అదే సమయంలో శాస్త్రీయ పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్న ప్రధానమంత్రి ఆదేశానికి అనుగుణంగా ఉపయోగించని సామర్థ్యాన్ని క్రమబద్ధీకరించడానికి మరియు ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చాలా కొద్ది దేశాలు విభిన్న వనరులను కలిగి ఉన్నందున వైవిధ్యీకరణను ప్రయోజనంగా తీసుకోవాలని ఆయన అన్నారు.

ఈ రోజు భారతదేశానికి 44 దేశాలతో సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారం ఉందని రాబోయే రోజుల్లో ఈ జాబితాను విస్తరిస్తామని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. నిర్ణీత సమయంలో ఫలవంతమైన ఫలితాలను సాధించడానికి మంత్రిత్వ శాఖ ఆధారిత ప్రాజెక్టుల కంటే సబ్జెక్ట్ బేస్డ్ పరిశోధనల కోసం కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సహకారంలో ఎక్కువ మంది నిపుణులను తీసుకురావాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కిచెప్పారు. అదే సమయంలో దేశీయ రంగాలతో విస్తృతమైన సహకారం కలిగి ఉండాలన్నారు. అటువంటి నిజమైన సామర్థ్యాన్ని సాధించడానికి మనం సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని విస్తరించాలని చెప్పారు.డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎర్త్ సైన్స్ మంత్రిత్వ శాఖ, సిఎస్ఐఆర్ లతో కలసి కొత్త కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఐదేళ్ల క్రితం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో దేశ రాజధానిలో విస్తృతమైన మేథోమథనం జరిగింది. ఇందులో వివిధ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాల ప్రతినిధులు ఇస్రో మరియు అంతరిక్ష శాఖ శాస్త్రవేత్తలు పరస్పర చర్చల్లో పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనుబంధంగా మెరుగుపరచడానికి మరియు వేగవంతం చేయడానికి మరియు వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఆధునిక అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునిక సాధనంగా ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. దీనిని అనుసరించి రైల్వేలు, రోడ్లు మరియు వంతెనలు, మెడికల్ మేనేజ్‌మెంట్ / టెలిమెడిసిన్, సకాలంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ల సేకరణ, విపత్తు సూచన మరియు నిర్వహణ వంటి వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ వివిధ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాల శాస్త్రవేత్తలను పరిశోధన మరియు అభివృద్ధి రంగంలో సహకారాన్ని మరింతగా పెంచాలని మరియు కార్యకలాపాలు మరియు పరిశ్రమలు మరియు కార్పొరేట్ సంస్థలతో సహకారాన్ని పెంచాలని కోరారు. దేశ నిర్మాణానికి వివిధ సైన్స్ మినిస్ట్రీలు కృషి చేస్తున్నప్పుడు వారికి సహకరించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. దేశీయ స్థాయిలో కాకుండా ప్రపంచ స్థాయిలో సమన్వయం మరియు సహకారం యొక్క విలువ గురించి కొవిడ్ నేర్పిందని చెప్పారు.

డాక్టర్ అనిల్ కాకోడ్కర్ తన ప్రసంగంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో అంతర్జాతీయ సహకారం గురించి భారతదేశానికి సుదీర్ఘ ట్రాక్ రికార్డ్ ఉంది. బహుళ ప్రయోజనాలను కలిగి ఉన్న సహకారంతో సహకార మరియు పోటీ స్ఫూర్తి కలిసి పోతుందని అన్నారు.

డిఎస్టి కార్యదర్శి ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, డిబిటి కార్యదర్శి శ్రీమతి రేణు స్వరూప్, భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. రాజీవన్, డిజి, సిఎస్ఐఆర్ మరియు కార్యదర్శి డిఎస్ఐఆర్ కార్యదర్శి శ్రీ శేఖర్ మండే మరియు మంత్రిత్వ శాఖ ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పోలీసులు అలర్ట్

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు,వరదలు అతలాకుతలం చేస్తున్న క్రమంలో ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న మరో రెండుమూడు రోజులు కూడా భారీగా వానలు పడే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ వారి హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని, జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే పొంగుతున్న వాగుల వద్ద పోలీసు అధికారులు తగు హెచ్చరికలను, వేరే దారులను సూచించే గుర్తులు ఉంచారు. గ్రామాల్లోనూ పాత ఇండ్లలో ఉన్నవారిని గుర్తించి సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఎస్.పి. పోలీసు అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా వర్షకాలంలో గ్రామాల మధ్య ఉన్న చిన్నచిన్న వాగులను దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రజలని ఎస్పీ కోరారు...

ఎగువ మానేరు జాలశయ నీటి మట్టం పూర్తి స్థాయిలో నిండి మత్తడి దుంకుతుందని, జలాశయం వద్దకు ఎవరికీ అనుమతి లేదని ఎస్పీ రాహుల్ హెగ్డే స్పష్టం చేశారు. ఎవరూ కూడా నీటి ప్రవాహాలు దగ్గరికి ఫోటోలు, సెల్ఫీల కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ప్రజలు ఈ పరిస్థితులలో పోలీస్ శాఖతో సహకరించాలని ఆయన కోరారు.భారీ వరదలు, వర్షాల క్రమంలో జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి అని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు..ఏమైనా సంఘటనలు జరిగితే సంబంధిత పోలీసులకు కానీ దయల్ 100 సమాచారం అందిచగలరూ

భద్రాచలంలో గోదావరి ఉగ్రరూపం.. నీటమునిగిన సీతమ్మ విగ్రహం

భద్రాద్రి కొత్తగూడెం, జులై 22: తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎస్సారెస్పీ ఎగువన విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి ఉప్పొంగుతోంది. గురువారం ఉదయం నుంచి భద్రాచలం వద్ద భారీగా నీటిమట్టం పెరుగుతోంది. ఈ క్రమంలో పర్ణశాలలో స్వామివారి నార చీరల ప్రాంతం పూర్తిగా నీటమునిగింది. అటు, సీతమ్మ వారి విగ్రహం, స్వామివారి సింహాసనం కూడా మునిగిపోయాయి.

ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాష్ట్రంలో మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. దాంతో, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

కొత్త ఆలోచన.. ఫేస్ మాస్కులతో గౌన్ కుట్టించుకున్న యువతి

హైదరాబాద్ , జులై 22:పెళ్లి బట్టలు ప్రత్యేకంగా ఉండాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. అందుకోసం సూటు, షేర్వానీ, కుర్తా, గౌను, చీర, హాఫ్ శారీ.. ఇలా రకరకాల బట్టలతో వధూవరులు తయారవుతారు. కానీ యూకేకు చెందిన వెడ్డింగ్ ప్లానర్ మార్కెటర్ హిచ్ వాడి పడేసిన ఫేస్ మాస్కులతో వెడ్డింగ్ గౌన్ రూపొందించి ధరించింది. దీంతో ఫ్యాషన్ ప్రియులు ఆమెను ప్రశంసిస్తున్నారు. అయితే వాడి పడేసిన మాస్కులతో కరోనా వైరస్ రాదా అన్నదే మీ సందేహం కదా.. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.కొవిడ్ ఆంక్షలు ఎత్తివేయడంతో యూకే ప్రజలు ఫ్రీడమ్ డేను జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జో

రైతుల ఆకలి కేకలు.. ప.గో జిల్లాలో మహా పాదయాత్ర

అమరావతి, జులై 22:ధాన్యం బకాయిలు విడుదల చేయాలంటూ పశ్చిమగోదావరి జిల్లాలో రైతులు మహా పాదయాత్ర చేపట్టారు. పాలకొల్లు యడ్లబజార్ నుండి నర్సాపురం వరకూ 12 కిలోమీటర్ల మేర రైతుల పాదయాత్రకు చేపట్టారు. రైతుల ఆకలి కేకలు పేరు మీద జోరువానలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. ధాన్యం బకాయిలు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులు పంట పండించడం కంటే అమ్ముకోవడమే కష్టంగా ఉందని ఎమ్మెల్యే నిమ్మల అన్నారు. రైతు ప్రభుత్వం అంటూ రంగుల ప్రకటనలు కాదని, ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పన్నుల భారం మోపడంపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. అరా కొరా ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సులతో రైతులను ప్రభుత్వం దగా మోసం చేస్తోందని మండిపడ్డారు.

ప్రతిపక్ష సభ్యులు దిగజారిపోయారు: కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, జులై 22:రాజ్యసభలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పెగాసస్ స్పైవేర్‌పై ప్రకటన చేస్తుండగా టీఎంసీ సభ్యులు ఆయన చేతిలోంచి స్టేట్‌మెంట్ పత్రాలు లాక్కుని చించేసిన ఘటనపై మరో కేంద్రమంత్రి మీనాక్షీ లేఖీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులు పూర్తిగా దిగజారిపోయారని.. ముఖ్యంగా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల సభ్యులైతే రాజకీయ ప్రత్యర్థులుగా అత్యంత నీచస్థాయికి పడిపోయారని ఆమె విమర్శించారు.

పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు దేశ పరువు, మర్యాదలను మంటగలిపేదిగా ఉన్నదని మీనాక్షీ లేఖీ మండిపడ్డారు. ఇవాళ సభలో ఐటీ మంత్రి ప్రకటన చేస్తుండగా ఓ సభ్యుడు ఆయన చేతిలోంచి పత్రాలను లాక్కుని చించి పారేయడం ఎంతవరకు సబబు..? అని లేఖీ ప్రశ్నించారు.

నేటి సాయంత్రం ఇంటర్ సెకండియర్ ఫలితాలు

అమరావతి, జులై 22:ఏపీలో ఇంటర్ సెకండియర్ ఫలితాలను శుక్రవారం సాయంత్రం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఫలితాలను మంత్రి ఆదిమూలపు సురేష్ విడుదల చేయనున్నారు. ఫలితాలను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా ఆప్షన్ ఇచ్చారు. పదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో సాధించిన మార్కులను ఆధారంగా చేసుకుని ఇంటర్ సెకండియర్ పరీక్షా ఫలితాలను అధికారులు విడుదల చేయనున్నారు.

కాగా కరోనా నేపథ్యంలో తొలుత ఏపీ ప్రభుత్వం చివరి క్షణం వరకు పరీక్షలను నిర్వహించాలనే ఉద్దేశంతోనే ముందుకుసాగింది. కానీ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పరీక్షలను రద్దు చేసింది. జులై 31లోపు పరీక్షా ఫలితాలను ప్రకటించాలన్న సుప్రీం ఆదేశాల మేరకు.. అంతలోపు పరీక్షలను నిర్వహించి, ఫలితాలను విడుదల చేయడం అసాధ్యమని భావించిన ఏపీ ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది.

యాదాద్రి ఘాట్‌రోడ్డుపై విరిగిపడ్డ బండరాళ్లు

యాదాద్రి భువనగిరి, జులై 22 : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే రెండే ఘాట్‌రోడ్డు మలుమలుపు వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం ఉదయం ఒక్కసారిగా రోడ్డుపై బండరాళ్లు పడ్డాయి. ఆ సమయంలో అటు వైపుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లుయింది. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. అనంతరం బండరాళ్లను తొలగించారు. మొదటి ఘాట్‌రోడ్డు ద్వారా భక్తులను కొండపైకి అనుమతిస్తున్నారు. అలాగే కొండపై బాలాలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిల్లు వర్షాలకు కూలిపోయాయి.

మూల వాగులో చిక్కుకున్న పది మంది జాలర్లు

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వేములవాడ మూలవాగు వరద నీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం ఉదయం వేములవాడ పట్టణానికి చెందిన 10 మంది వ్యక్తులు చేపల వేటకు వెళ్లారు. వరద ప్రవాహం ఎక్కువడంతో వాగు మధ్యలో ని ఒడ్డుకు చేరారు. గంట గంటకు వాగులో వరద నీటి ప్రవాహం పెరగడంతో మధ్యలోనే చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వేములవాడ పట్టణ సీఐ వెంకటేశ్ మూలవాగు వద్దకు వెళ్లి సహాయక చర్యలు అందిస్తున్నారు. గజ ఈతగాళ్లు తోపాటు తాడును వేసి బయటకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్

సంగారెడ్డి, జులై 22:: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న పథకాలను ప్రవేశ పెడుతున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.నిఆర్థిక పునరావాస పథకం ద్వారా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఐదుగురు దివ్యాంగులకు మంజూరైన 50 వేల రూపాయల చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక పునరావాస పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీతో కూడిన 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఆయా మండలాల ఎంపీపీ లు

కృష్ణమ్మ పరవళ్లు.. సంగమేశ్వర ఆలయాన్ని తాకిన వరద నీరు

హైదరాబాద్ , జులై 22:సప్తనదీ సంగమేశ్వరం వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కర్నూలు జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం, కొత్తపల్లి మండలంలో వెలసిన సప్త నదుల సంగమేశ్వర ఆలయానికి కృష్ణా జలాలు చుట్టు ముట్టాయి. దీంతో సంగమతీరం సంద్రాన్ని తలపిస్తోంది.

గత వారం రోజులుగా వరద పోటెత్తడంతో సంగమేశ్వరం వద్ద ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు సంగమేశ్వరం జల వారధి కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు తెలకపల్లి రఘురామ శర్మ బుధవారం ఉదయం అంత్య పూజలు నిర్వహించారు. ఇక వరద జలాలు ఆలయంలోకి చేరుకోవడంతో సప్త నదుల సంగమేశ్వరుడిని గంగమ్మ తాకి పరశించిపోతోంది.. దీంతో సంగమేశ్వరుడు గంగమ్మ ఒడిలోకి జారుకుంటున్న అపురూప దృశ్యం కనులవిందు చేస్తోంది. మరోపక్క పతిని తాకిని గంగమ్మ పరవశం పొందుతోంది.

ఈ సతీపతుల సంగమానికి ఆలయ పురోహితుడు వేపదార శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అపురూపమైన అద్భుతమైన దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పోటెత్తారు. ప్రస్తుతం

ప్రపంచంలో 7 నదులు ఒకేచోట కలిసే ఏకైక ప్రదేశం సంగమేశ్వరం. ఈ నదులన్నీ కలసి జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని తాకుతూ..చివరికి సముద్రంలో కలసిపోతాయి. ఏడు నదులు కలిసే చోటున ఉన్న శివుడి ప్రతిరూపమైన వేప లింగాన్ని సందర్శిస్తే.. నరకలోక ప్రవేశం నుంచి తప్పించుకోవచ్చునని భక్తుల నమ్మకం. వాస్తవంగా సంగమేశ్వరాలయం ఈ ఏడాది మార్చి 21వ తేదీ శ్రీశైల జలాశయ కృష్ణా జలాల్లో నుండి బయటపడింది. తిరిగి ఇప్పుడు జులై 21వ తేదీ ఆలయం ప్రాంగణంలో నీళ్లు వచ్చి స్వామి గర్భలయంలోకి ప్రవేశించి.. వేపదారు శివలింగాన్ని తాకాయి. 122 రోజులు పాటు స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చాడు. మళ్ళీ స్వామి వారి దర్శనం కలగాలంటే 8 నెలలు వేచిచూడాలి భక్తులు.

గత ఏడాది జులై21 వ తేదీ గర్భాలయం లోకి నీరు ప్రవేశిస్తే, ఈసంవత్సరం కూడా సరిగ్గా జులై 21 వతేదీ రోజే కృష్ణా జలాలు సంగమేశ్వరున్ని తాకాయి. తొలి ఏకాదశి పుజల అనంతరం స్వామి వారికి ఈ సంవత్సరం చివరి పూజలు జరిపించారు అలయ అర్చకులు తెలకపల్లి రఘురాం శర్మ.ఈ ఆలయం ఎక్కువ రోజులు శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో మునిగివుంటుంది. మరో విషయం ఏమిటంటే వేల సంవత్సరాల క్రితం సంగమేశ్వరాలయంలో ప్రతిష్టించిన వేపలింగం బీముడు ప్రతిష్టించారు. వేపదారు శివలింగం అయిన ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తోంది. మొత్తంగా సంగమ తీరంలో గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఆలయం నీట మునిగిన అపురూప దృశ్యం తిలకించేందుకు చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడం గమనార్హం.

పద్ధతి మార్చుకోండి: గ్రామ సర్పంచ్లకు హరీశ్ ఆదేశం

సిద్దిపేట, జులై 22:: గ్రామాల అభివృద్ధి సంపూర్ణ బాధ్యత మీదేనని, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ అధికారులతో కలిసి సమన్వయంతో పూర్తి చేయించాలని ఆయా గ్రామ సర్పంచ్‌లకు మంత్రి హరీశ్ రావు సూచించారు. సిద్దిపేటలోని మంత్రి నివాసంలో గురువారం సిద్దిపేట రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనుల పురోగతిపై సుదీర్ఘంగా మంత్రి సమీక్షించారు. మండల పరిధిలోని గ్రామాల వారీగా చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులను ఆరా తీశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సర్పంచ్‌లంతా టీమ్ లీడర్‌గా వ్యవహరించి అసంపూర్తి పనులపై అధికారులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులతో చర్చించాలన్నారు. పలు గ్రామాల్లో చేపడుతున్న పనులపై అధికారులకు కనీస పర్యవేక్షణ కొరవడిందన్నారు. పనితీరు మార్చుకోవాలని, గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను మంత్రి సుతిమెత్తగా ఆదేశించారు.

మిషన్ భగీరథ తాగునీరు, విద్యుత్, వైకుంఠ ధామాలు, సెగ్రీ గేషన్ షెడ్- డంప్ యార్డులు, పల్లె ప్రకృతి వనం, కొత్త పంచాయతీ భవనాలు, గ్రామాల్లోని పలు కుల సంఘ భవనాల నిర్మాణాల ప్రగతి పనులన్నీ త్వరితగతిన చేపట్టాలని ఆయా శాఖాధికారులను మంత్రి ఆదేశించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, డీపీఓ పార్థసారథి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస చారి, డీఈ నాగభూషణం, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ చారి, ఏంపీడీఓ సమ్మిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అద్భుత కట్టడంగా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్

హైదరాబాద్ , జులై 22: పారిస్‌కు ఈఫిల్ టవర్.. దుబాయ్‌కు బూర్జు ఖలీఫా ఎలాగో హైదరాబాద్‌కు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ అలాగ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా గొప్ప అద్భుత కట్టడంగా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూపుదిద్దుకుంటుందని మంత్రి తెలిపారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతి పై మంత్రి బుధవారం ఎర్రమంజిల్ ఆర్ అండ్ బి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీజీపీ మహేందర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్, ఆర్ అండ్ బి ఈఎన్సీ గణపతి రెడ్డి, వర్క్ ఏజన్సీ ప్రతినిధి లక్ష్మణ్, మ్యూజియం నిర్మాణ నిపుణులు, పలువురు అధికారులు హాజరయ్యారు.

రెండు నెలల్లో నిర్మాణం పూర్తికావాలి..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రెండు నెలల్లో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం పూర్తి కావాలని వర్క్ ఏజెన్సీని, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పోలీస్ కమాండ్ సెంటర్ 14వ అంతస్థు నుంచి హైదరాబాద్ నగర నలువైపులా ఉన్న ముఖ్య ప్రదేశాలైన చార్మినార్, గోల్కొండ కోట, కేబీఆర్ పార్క్, హుస్సేన్ సాగర్ చూపరులకు ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా కన్పిస్తాయన్నారు. రానున్న రోజుల్లో సంవత్సరం పొడవునా సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు.

వసీంఖాన్ నేతృత్వంలో మ్యూజియం ఏర్పాటు..

పారిస్‌లో ఈఫిల్ టవర్, దుబాయ్‌లో బూర్జు ఖలీఫా మీద నుంచి ఆయా నగరాలను ఏ విధంగా సందర్శకులు వీక్షిస్తారో.. అదేవిధంగా తెలంగాణలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 14వ అంతస్థు నుండి హైదరాబాద్ నగరాన్ని సందర్శకులు వీక్షించవచ్చన్నారు. సందర్శకుల సౌకర్యార్థం రాష్ట్ర సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్పే వివరాలు, తెలంగాణ సాధించిన విజయాలు, తెలంగాణ పోలీస్ శాఖ, కమాండ్ కంట్రోల్ సెంటర్ వివరాలు అందులోనే నిర్మించే మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. ప్రముఖ మ్యూజియం నిర్మాణ నిపుణులు వసీంఖాన్ వారి భాగస్వాములు ఆధ్వర్యంలో ఈ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

హుజురాబాద్ పాదయాత్రలో ఈటల కీలక వ్యాఖ్య

హైదరాబాద్ , జులై 22:హుజురాబాద్ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రజా దీవెన యాత్ర పేరుతో పాదయాత్రను కొనసాగిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆయన గురువారం ఇల్లంతకుంట మండలంలోని మర్రివానిపల్లి, సీతంపేటలో పర్యటించారు. మర్రివానిపాలెం నుంచి నడుచుకుంటూ సీతంపేటకు చేరుకున్నారు. వర్షంలోనే పలు చోట్ల ప్రసంగించారు. తాను రాజీనామా ఎందుకు చేయాల్సి వచ్చిందనే దానిపై కీలక వ్యాఖ్యలు చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పదవికి తనంతతానుగా రాజీనామా చేయలేదని ఈటల రాజేందర్ అన్నారు. టీఆర్ఎస్ అధిష్ఠానం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తేనే తాను అలా చేసినట్లు తెలిపారు. అసలు టీఆర్ఎస్ పార్టీని తాను వదలలేదని, వదిలేలా వాళ్లే చేసుకున్నారని వ్యాఖ్యానించారు. అయిన వాళ్లకు ఆకుల్లో, కాని వాళ్లకు కంచాల్లో కేసీఆర్ పెడుతుంటారని ఈటల విమర్శించారు.

కృష్ణా జిల్లాలో పెంపుడు కుక్కకు కాంస్య విగ్రహం

హైదరాబాద్ , జులై 22:ఇప్పటి సమాజంలో మనుషుల కంటే జంతువులనే ప్రజలు ఎక్కువగా నమ్ముతున్నారు.

జంతువులపై మనం ఎంత ప్రేమ చూపిస్తే అవి మనకు అంత విశ్వాసంగా పనిచేస్తాయని నమ్మకం. అందుకే చాలా చోట్ల పెంపుడు జంతువుల చనిపోతే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లాలో ఓ వ్యక్తి తాను పెంచుకున్న కుక్కపై ఎంత మమకారం చూపాడో ప్రతి ఒక్కరూ తెలుసుకుని తీరాల్సిందే.

గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం అంపాపురంకు చెందిన సుంకర జ్ఞాన ప్రకాశరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహం చేసి అత్తారింటికి పంపాడు. కూతుళ్లు కాపురానికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉన్న జ్ఞానప్రకాశరావు దంపతులకు ఓ కుక్క పిల్ల దొరికింది. దీంతో దానిని అల్లారు ముద్దుగా సాకారు. కుక్క కూడా సదరు దంపతులను సొంతవారిలా భావించేది. జ్ఞానప్రకాశరావు బయటకు వెళ్తే తిరిగి వచ్చేవరకు ఆహారం ముట్టేది కాదు. ఇంట్లో ఎవరికైనా జ్వరం వస్తే ఆ జ్వరం తగ్గేవరకు ఏం తినేది కాదు. ఆ దంపతులకు కావాల్సిన వస్తువులను నోటితో పట్టుకుని వచ్చేది. దీంతో ఆ మూగ జంతువు చుట్టుపక్కల వారిని కూడా ఆశ్చర్యపరిచేది.

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌ను తాకిన వరదనీరు

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో ప్రభుత్వ కార్యాలయాలు వదర నీటిలో మునిగిపోతున్నాయి. ఇటీవల బతెలంగాణ సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించిన రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ భవనం వరదల కారణంగా నీటమునిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ భవనం చుట్టూ వరద నీరు చేరింది. ఇటీవలే కార్యాలయంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ లోకి వెళ్లే మార్గం పూర్తిగా జలమయమైంది. కాగా, జులై 4న సిరిసిల్లలో సకల సౌకర్యాలతో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

మీడియా అకాడమి భవనాన్ని పరిశీలించిన అల్లం నారాయణ

హైదరాబాద్ , జులై 22:నాంపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న మీడియా అకాడమి భవనం త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లను కోరారు. శనివారంనాడు నాంపల్లిలో మీడియా అకాడమి భవన నిర్మాణ పనులను చైర్మన్ అల్లం నారాయణ పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. మీడియా అకాడమి నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన జర్నలిస్టులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు ఉపయోగకరంగా ఉండే విధంగా మీడియా అకాడమి భవనాన్ని బహుళ అంతస్తుల భవనంగా నిర్మిస్తున్నారు. ఇందులో 200 మందికి సరిపడే విధంగా ఆడిటోరియంను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ భవనంలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు, సర్టిఫికేట్ కోర్సుల నిర్వహణ, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, వీడియా కాన్ఫరెన్స్ తో పాటు ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆడిటోరియంను నిర్మిస్తున్నామని అన్నారు.

ఈ భవనం ద్వారా జర్నలిస్టులకు మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. భవన నిర్మాణంలో అవసరమైన మార్పులను అధికారులకు సూచించారు. నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఇంజినీర్లకు సూచించారు. క్రమం తప్పకుండా పనులను పర్యవేక్షించాలని మీడియా అకాడమి అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, అసిస్టెంట్ ఇంజనీర్ నితిన్, మీడియా అకాడమి మేనేజర్ వనజ, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డకు ఎస్ఎల్ఈ వ్యాధి

హైదరాబాద్ , జులై 22: అరుదైన గుండె జబ్బుతో జన్మించిన ఓ శిశువుకు విజయవంతంగా చికిత్స నిర్వహించి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించారు లక్డీకాపూల్‌లోని లోటస్ దవాఖాన వైద్యులు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీఎస్‌వీ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. గత నెల 17న హైటెక్ సిటీలోని బైరాగిగూడ శివసాయినగర్‌కు చెందిన సౌందర్యకు నెలలు నిండకుండానే (8వ నెల) ఆడ శిశువు జన్మించింది. ఆ చిన్నారికి పరీక్షలు నిర్వహించగా, సిస్టమిక్ లూపస్ ఎరిథెమెటాసిస్ (ఎస్ఎల్ఈ) వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. తల్లి నుంచి కొన్ని ప్రతిరోధకాలు (ప్రొటీన్లు) పుట్టబోయే శిశువు రక్తంలోకి వెళ్లి, ఇవి గుండె కండరాల ఫైబర్‌లపై దాడి చేసి దెబ్బతీస్తాయి.

దీని వల్ల గుండె నుంచి మిగతా అవయవాలకు రక్తాన్ని సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడుతుంది. తద్వారా గుండె నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు తగ్గడం వల్ల వారి ప్రాణానికే ప్రమాదంగా పరిణమిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 25 సంవత్సరాల వ్యవధిలో ఇలాంటి కేసులు సుమారు 20వరకు మాత్రమే నమోదయ్యాయి. దీంతో ఆ శిశువును నెల రోజుల పాటు ఐసీయూలో ఉంచి ఊపిరితిత్తులకు వైద్యం అందిస్తూ గుండె వేగం పెరిగేలా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించామని డాక్టర్ ప్రసాద్ తెలిపారు. శిశువు పూర్తిగా కోలుకొని సాధారణ స్థితికి చేరుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు చెప్పారు.

ఆరు దశాబ్దాల సమస్యకు ఆరు నెలల్లోనే పరిష్కారం

సూర్యాపేట, జులై 22:: ఆరు దశాబ్దాల సమస్యకు ఆరు నెలల్లోనే పరిష్కారం లభించింది. స్వరాష్ట్రంలో సుపరిపాలన అన్నది నిరూపణ జరిగింది. అందుకు కృషి చేసిన విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని కోదాడ పట్టణ వాసులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. వివరాలల్లోకి వెళ్తే.. 60 ఏండ్ల కిందట విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన 33 ఎల విద్యుత్ వైర్లు కాలక్రమేణా విస్తరించడంతో కోదాడ పట్టణ ప్రజలకు ప్రమాదకరంగా పరిణమించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే విషయాన్ని అప్పటి ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు అప్పటి పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. దాంతో కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో రెండో సారి జరిగిన ఎన్నికల్లో కోదాడ నుంచి ఎన్నికయిన స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత శాఖ మంత్రి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

విషయాన్ని అర్థం చేసుకున్న మంత్రి 33ఎల వైర్లతో 240 కి పై కుటుంబాలు అవస్థలు పడుతున్నారని తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. వారితో నివేదిక తెప్పించుకున్న మంత్రి అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మంత్రి ఆదేశానుసారం డీఎంఎఫ్‌టీ నిధులు విడుదల చేయడంతో రంగంలోకి దిగిన విద్యుత్ సిబ్బంది ఆఘమేఘాల మీద విద్యుత్ వైర్లను తొలగించారు.

60 ఏండ్లుగా ఇబ్బంది పడుతున్న వైర్ల ప్రమాదం విషయం తెలియంగానే స్పందించి తొలగించిన మంత్రి కి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రజలు మంత్రి జగదీష్ రెడ్డి అందించిన సహకారాన్ని కొనియాడారు.

ఇప్పటికైతే ఎవరూ నా రాజీనామా కోరలేదు: యెడియూరప్ప

బెంగళూరు, జులై 22: కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప స్థానంలో బీజేపీ హైకమాండ్ మరో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించబోతున్నదన్న ప్రచారం మరింత జోరందుకున్నది. ఈ నెల 26న యెడియూరప్ప తన పదవికి రాజీనామా చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు మీడియా ప్రతినిధులు ఈ విషయమై యెడియూరప్పను ప్రశ్నించారు.

అందుకు యెడియూరప్ప స్పందిస్తూ.. ఇప్పటివరకైతే ఎవరూ తనను రాజీనామా చేయమని అడగలేదని చెప్పారు. హైకమాండ్ నుంచి అలాంటి ఆదేశాలు ఏమైనా వస్తే.. పదవి నుంచి తప్పుకుని, పార్టీ కోసం పనిచేస్తానని ఆయన తెలిపారు. మీ వారసుడిగా మీరు ఎవరి పేరునైనా రికమెండ్ చేస్తారా..? అన్న ప్రశ్నకు తాను ఎవరి పేరునూ రికమెండ్ చేయబోనన్నారు. పార్టీ అధిష్ఠానమైతే ఇంతవరకు ఏమీ చెప్పలేని, జూలై 26 తర్వాత ఏం జరుగనుందో వేచి చూద్దామని యెడ్డీ వ్యాఖ్యానించారు.

ఇదిలావుంటే.. వీరశైవ, లింగాయత్‌లకు చెందిన వివిధ మఠాల అధిపతులు యెడ్డీకి మద్దతు పలుకుతున్నారని, అందుకే బీజేపీ హైకమాండ్ యెడ్డీని సీఎం పదవి నుంచి తప్పించాలని భావిస్తున్నా.. ఆ విషయంలో కొంత ఆచితూచి వ్యవహరిస్తున్నదని కర్ణాటకలో రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

వేములవాడ రూరల్ మండలం కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): టీపీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఛలో రాజభవన్ ముట్టడికి వెళ్లకుండా వేములవాడ రూరల్ కాంగ్రెస్ నాయకులను గురువారం ఉదయం గంటలకే ముందస్తుగావేములవాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పక ళాభరణం శ్రీనివాస ,ఎదురుగట్ల సర్పంచ్ సోయి నేని కరుణాకర్ మాట్లాడుతూ

సెల్ ఫోన్ ట్యాపింగ్ చేస్తూ వ్యక్తిగత గోప్యతకు తూట్లు పొడుస్తున్న మోదీ సర్కార్ కు వ్యతిరేకంగాగురువారం మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకు రాజభవన్ ముట్టడికి వెళ్ళడానికి సిద్ధ మయ్యామన్నారు. ఇంతలోనే పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు.ఎన్ని నిర్బంధాలు ఎదురైనా రాజ్ భవన్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు చేసి తీరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అరెస్ట్ లతో ఉద్యమాలనుఆపలేరన్నారు.టిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండూ ఏకమై ప్రజలను అణచి వేతకు గురిచేస్తున్నారని విమర్శించారు. నూకలమర్రి ఎంపీటీసీ బొడ్డురాములు,మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం , లింగ పెల్లి మనోహర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్ వారిలో ఉన్నారు .

ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేస్తే సహించం కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్

నిరసనలు చేస్తే ఇక్కడికి అక్కడ అరెస్టులు చూపిస్తున్నా ప్రభుత్వం

రాజన్న సిరిసిల్ల, జులై 22:(నేటినిజం ప్రతినిధి): ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేస్తే సహించమని,రాష్ట్ర ప్రభుత్వం చేస్తూ చేస్తున్నటువంటి ముందస్తు అక్రమ అరెస్టులు, గృహనిర్బందాలు తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ కాంగ్రెస్ గురువారం తలపెట్టిన హైద్రాబాద్ లోని రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్తున్న వేములవాడ కాంగ్రెస్ నాయకులను బుధవారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు .ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలతో పాటు పలువురు ప్రముఖుల ఫోన్లను ట్యాపరింగ్ జరుగుతుందనే వార్తాకథనాల రావడం ఆందోళన కరమైన అంశం గాభావిస్తున్నామని,గోడ చాటు మాటలు వినడం హేమమైన చర్యగాఅభివర్ణించారు.

ఫోన్ ట్యాపరింగ్ చేసిన వారి పైన వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుఉపాధ్యాయుల సమస్యలు, ఆశ వర్కర్ల సమస్యలు, రైతుల సమస్యలు, యువతకు ఉద్యోగ అవకాశ సమస్యలు, కరోనాకష్టకాలంలో ఉపయోగించుకున్న నర్సుల సమస్యలపై, ఉపాధి హామీ వారి సమస్యల, కార్మికుల సమస్యల పైన, అనేక సమస్యల పైన పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరల పైన పోరాడుదాం అంటే పోలీసులు అడ్డుపెట్టుకుని అరెస్టు చేయడం పిరికిపంద చర్యగా భావిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మోడిగే చంద్రశేఖర్, డిసిసి కార్యదర్శి చిలుక రమేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కూరగాయల కొమరయ్య నాయకులు అరుణ్ తేజ చారి, నాగుల విష్ణు ప్రసాద్, కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, వస్తాది కృష్ణ, తదితరులు ఉన్నారు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జులై 22: జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మంత్రి జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో మంజూరయిన వంతెనలను వెంటనే చేపట్టి పూర్తిచేయాలి. అలాగే పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ఇండ్లను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి సరఫరా మీద దృష్టిపెట్టాలని మంత్రి పేర్కొన్నారు. లీకేజీల మూలంగా నీటి కలుషితం జరగకుండా చూసుకొని లీకేజీలు అరికట్టాలన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం నిర్దేశించుకుని గడువులోపు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 24న హరితహారంలో భాగంగా ముక్కోటి వృక్షార్చనను విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

గ్రామాలలో బలహీనంగా ఉన్న చెరువులు, కుంటలను గుర్తించి అవి తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిట్యాల రోడ్డు, జెర్రిపోతుల వాగు, రామా టాకీస్ వద్ద వంతెనలను వెంటనే చేపట్టాలి.

వర్షాకాలాన్ని కాంట్రాక్టర్లు సాకుగా చూపితే అధికారులు రాజీపడొద్దన్నారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరు బాగుంది. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి జీతాలు పెంచిందన్నారు.

వనపర్తి రోడ్ల విస్తరణ పట్ల అదనపు కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ అపూర్వారావు, జేసీ అంకిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఐజీ రంగనాథ్

నల్లగొండ, జులై 22:: జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా కరెంటు ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను ముట్టుకోకుండా చిన్నపిల్లలను దూరంగా ఉంచాలని డీఐజీ ఏవీరంగనాథ్ సూచించారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గాని, రహదారులు గాని, పొలాలకి వెళ్ళే బాటాలుగాని భారీ వర్షాల కారణంగా కొట్టుకోపోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడితే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే స్థానిక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. చెరువులు, కుంటలు, వాగులు నీటితో నిండి ఉప్పొంగుతుంటాయని, వాగులు ప్రమాద స్థాయిలో పరుగులు పెడుతున్న సమయం లో ఎట్టి పరిస్థితుల్లో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు.

గ్రామీణ ప్రాంతాలలో పాడుబడిన బావులు, చుట్టూ కంచె లేని బావుల దగ్గర జాగ్రతగా ఉండాలన్నారు. వాహనదారులు నెమ్మదిగా తమ గమ్యాలను చేరుకోవాలని, ప్రజల సంక్షేమంలో కూడా పోలీస్ అధికారులు ఎల్లపుడూ ముందుంటారని రంగనాథ్ తెలిపారు. ప్రజలంతా పోలీసులతో సహకరిస్తూ ఎలాంటి విపత్కర పరిస్థితులున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

దాశరథి స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జులై 22: : 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అనే దాశరథి స్ఫూర్తితో తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి చేసుకున్నామని మంత్రి హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట వివంచి ఆడిటోరియంలో గురువారం దాశరథి కృష్ణమాచార్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

నాడు కరువు ప్రాంతంగా ఉన్న తెలంగాణలో నేడు పసిడి పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు.

3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు.

పుస్తక పఠనం వల్ల జ్ఞానం పెరుగుతుందని, జిల్లా లైబ్రరీని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. 50 వేల ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఇక నుంచి ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీకి సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటరన్నారు. ఇప్పటి వరకు 1 లక్షా 32 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన సంపూర్ణ సహకారం ఆర్థిక శాఖ తరపున అందిస్తానని భరోసా ఇచ్చారు.

అంతకుముందు దాశరథి పాటలు, ఆయన రాసిన కవిత్వం వింటుంటే అమృత ధారలు కురిసిన విధంగా మంచి అనుభూతి పొందినట్లు మంత్రి చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని, పీడిత ప్రజల పక్షాన పోరాడినట్లు చెప్పుకొచ్చారు. దాశరథి కలలుగన్న వారి ఊహాల్ని తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నిజం చేస్తున్నారని మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వం థర్డ్ వేవ్‌ను పట్టించుకోవడంలేదు: మమతాబెనర్జి

కోల్‌కతా, జులై 22:: దేశంలో థర్డ్ వేవ్ విజృంభించనుందన్న వార్తలు గుప్పుమం టున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా స్తబ్దుగా ఉన్నదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి విమర్శించారు. తాను త్వరలోనే ఢిల్లీకి వెళుతున్నానని, ఓ రెండు మూడు రోజులపాటు తన పర్యటన కొనసాగనుందని ఆమె తెలిపారు. తనకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ అప్పాయింట్మెంట్ ఇచ్చారని, పర్యటనలో భాగంగా తాను వారితో భేటీ కానున్నానని మమత వెల్లడించారు. వివిధ పార్టీల నాయకుల నుంచి తనకు కలుద్దామని అభ్యర్థనలు వచ్చాయని, వీలైతే వాళ్లందరినీ కలిసే ప్రయత్నం చేస్తానని ఆమె చెప్పారు.

నిర్మల్ వర్ష ప్రభావిత ప్రాంతాల పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఆరా

నిర్మల్, జులై 22:: ఎడతెరిపి లేని వర్షాలతో నిర్మల్ పట్టణం జలమయమైంది. కాగా, వరద ప్రాంతాల్లో పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వరద ముంపునకు గురయ్యే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మరో 24 గంటల పాటు అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ చెప్పారు. ఏ ఒక్కరి ప్రాణం పోకుండా కాపాడడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలన్నారు. సహాయక చర్యలు చేపట్టడానికి నిర్మల్‌కు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపుతున్నామన్నారు.

హుజురాబాద్‌లో కుల సంఘ భవనాలకు పట్టాలు అందజేత

కరీంనగర్ జులై 22:నేటినిజం ప్రతినిధి): హుజురాబాద్‌లో మున్నూరుకాపు, రజక సంఘాలకు భవన నిర్మాణాల నిమిత్తం భూమి పట్టాల్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అందజేశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందిస్తూ అడిగిందే తడవుగా కుల సంఘాలకు ఎకరం భూమి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పట్టాలను గురువారం హుజురాబాద్‌లో కుల సంఘాల ఆధ్వర్యంలో సిటీ సెంటర్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సహచర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి గంగుల కమలాకర్ సంఘ నాయకులకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బీసీలకు ఆత్మగౌరవ ప్రతీకలుగా కుల సంఘాల భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ భవనాలు కొన్ని చోట్ల పూర్తికాగా మరికొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాలు ఆత్మగౌరవంతో బతుకుతున్నాయన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లైనా ఎందరో ప్రధానులు, ముఖ్యమంత్రులు మారినా ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం సంకల్పించని ఆత్మగౌరవ భవన నిర్మాణాల కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ సర్కార్ శ్రీకారం చుట్టిందన్నారు. అయితే దురదృష్టవశాత్తు ఇక్కడి స్థానిక మాజీ శాసన సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఏనాడు కూడా బీసీల గురించి సీఎం కేసీఆర్‌ను అడగకుండా ద్రోహం చేశాడని మండిపడ్డారు.

అడగనిదే అవ్వైనా అన్నం పెట్టదని మంత్రి అన్నారు. స్థానిక సమస్యలను ఈటల ఏనాడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేదని ధ్వజమెత్తారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే తొలివిడతగా ముస్నూరు కాపు, రజక సంఘాలకు భూమిని కేటాయించారన్నారు. ఎకరం భూమితో పాటు ఒక్కో భవన నిర్మాణానికి రూ. 50 లక్షల నిధుల్ని తొలివిడతగా అందించారన్నారు.మొదటి విడతగా నిధుల్ని అందించడంతో పాటు మలి విడత నిధుల్ని కూడా తీసుకొస్తానని మంత్రి గంగుల తెలిపారు. ఇంతలా మన సంక్షేమాన్ని చూస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్న సీఎంకు మద్దతుగా టీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, ఎగ్గే మల్లేశం, మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి- హరిశంకర్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దేశంలో ప్రత్యక్ష అమ్మకాలలో దక్షిణ 13%, తెలంగాణ వాటాలు 1.74%: ఐడిఎస్ఎ సర్వే

హైదరాబాద్ , జులై 22:మొత్తం స్థూల ప్రత్యక్ష అమ్మకాలలో దక్షిణ ప్రాంతం 13% వాటాను కలిగి ఉంది. 2019-20లో తెలంగాణ యొక్క సహకారం 1.74% వద్ద ఉందని ఈ రోజు విడుదల చేసిన ఒక సర్వే తెలిపింది. ఈ ప్రాంతంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, అండమాన్ నికోబార్, పాండిచేరి, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్ (ఐడిఎస్ఎ) విడుదల చేసిన వార్షిక సర్వే నివేదిక ప్రకారం, కర్ణాటక (4.38%), తమిళనాడు (2.68%), కేరళ (2.55%), తెలంగాణ ఆంధ్రప్రదేశ్ (1.29%) ప్రత్యక్ష రాష్ట్రాలలో అగ్రస్థానంలో ఉన్నాయి దక్షిణ ప్రాంతంలో రాష్ట్రాలను అమ్మడం. 2019-20 సర్వే ప్రకారం, 2019-20లో దేశంలో ప్రత్యక్ష అమ్మకాలలో 28% ఉత్తర ప్రాంతం దోహదపడింది, తూర్పు ప్రాంతం తరువాత 26% అమ్మకాలతో ఉంది. రాష్ట్రాలలో, మహారాష్ట్రలో 2019-20లో 12% స్థూల అమ్మకాలతో దేశవ్యాప్తంగా అత్యధిక అమ్మకాలు జరిగాయి, పశ్చిమ బెంగాల్ తరువాత, దేశంలో ప్రత్యక్ష అమ్మకాలలో 11% వాటాను కలిగి ఉంది. ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ ఇండస్ట్రీ సంవత్సరానికి 28% ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేసింది, స్థూల పరిశ్రమ టర్నోవర్ 2019-20లో 16,776 కోట్ల రూపాయలుగా ఉంది. వార్షిక సర్వే నివేదిక ప్రకారం. పరిశ్రమల టర్నోవర్ 2018-19లో 13,080 కోట్ల రూపాయలుగా ఉంది. ఇప్సోస్ స్ట్రాటజీ 3 చేత కట్టుబడి ఉన్న ఐడిఎస్ఎ వార్షిక సర్వే నివేదిక 2019-20ను వాస్తవంగా వాణిజ్య పరిశ్రమల గౌరవ మంత్రి సోమ్ ప్రకాష్ విడుదల చేశారు. సర్వేను విడుదల చేస్తూ మంత్రి మాట్లాడుతూ "ప్రత్యక్ష అమ్మకపు పరిశ్రమ అవకాశం కల్పిస్తోంది దేశంలోని మిలియన్ల మందికి స్వయం ఆదాయాన్ని సంపాదించడానికి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటి. ఈ విషయంలో మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలు చేపట్టింది, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమను నేను కోరుతున్నాను. " ఐడిఎస్ఎ చైర్‌పర్సన్ రిని సన్యాల్ ఒక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా మహమ్మారి కారణంగా విపరీతమైన సామాజిక-ఆర్థిక ఇబ్బందులు ఉన్న సమయంలో డైరెక్ట్ సెల్లింగ్‌లో కొన్ని ప్రోత్సాహకరమైన పోకడలను ఈ నివేదిక చూపిస్తుంది. పరిశ్రమ యొక్క వృద్ధి పథం సంవత్సరాలుగా పెరుగుతోంది. 18% ఐడిఎస్ఎ అనేది దేశంలో డైరెక్ట్ సెల్లింగ్ వ్యాపారం స్థిరమైన పురోగతిని సాధించిందనే దానికి నిదర్శనం రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వం ఇచ్చిన రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ నేపథ్యంలో దాని స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉంది. సర్వే నివేదిక ప్రకారం, ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ అమ్మకాలలో వెల్నెస్ న్యూట్రాస్యూటికల్స్ ఉత్పత్తులు 57% దోహదపడ్డాయి, తరువాత 2019-20లో 22% కంట్రిబ్యూషన్ అమ్మకాలతో సౌందర్య వ్యక్తిగత సంరక్షణ విభాగం ఉన్నాయి. "2019లో 15వ స్థానం నుండి భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా 12వ అతిపెద్ద డైరెక్ట్ సెల్లింగ్ మార్కెట్కు ఎదిగిందని నేను సంతోషంగా ఉన్నాను. మునుపటి అంచనాల కంటే చాలా త్వరగా భారతదేశం ప్రపంచంలోని టాప్ -5 డైరెక్ట్ సెల్లింగ్ మార్కెట్లలోకి ప్రవేశిస్తుందని మాకు నమ్మకం ఉంది. "అని ఐడిఎస్ఎ వైస్ చైర్మన్ రజత్ బెనర్జీ అన్నారు. "భారతదేశంలో డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమలో సుమారు 7.4 మిలియన్ డైరెక్ట్ సెల్లర్లు పనిచేస్తున్నారు. ది 30% అద్భుతమైన పెరుగుదల ఉంది. డైరెక్ట్ సెల్లింగ్ వ్యాపారంలో పెరుగుతున్న నమ్మకం విశ్వాసం ఇది చూపిస్తుంది "అని ఇప్సోస్ స్ట్రాటజీ 3ఇండియా హెడ్ మిస్టర్ భాస్కర్ కెనగరాజ్జా అన్నారు. నివేదిక ప్రకారం, గ్లోబల్ డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమ 2020 లో 179.3 బిలియన్ డాలర్లుగా ఉంది, ఇది 2019 లో 175.3 బిలియన్ డాలర్ల పరిశ్రమ విలువ నుండి 0.1% మార్జినల్ డీగ్రోత్ను చూపించింది. అయితే, ఈ క్షీణత ఎక్కువగా చైనాలో వ్యాపారం పతనానికి కారణం, ఇది మొత్తం ప్రపంచ వ్యాపారంలో తగ్గుదలకు దారితీసింది. దేశాలలో, 2020 లో 40,100 మిలియన్ డాలర్ల అమ్మకపు విలువ కలిగిన గ్లోబల్ డైరెక్ట్ సెల్లింగ్ వ్యాపారంలో యునైటెడ్ స్టేట్స్ 22.4% వాటాను కలిగి ఉంది. చైనా 10.7% వాటాతో చైనా తరువాత, మొత్తం డైరెక్ట్ సెల్లింగ్ అమ్మకపు విలువ 2020 లో 19,183 మిలియన్లు. సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఉపయోగించడం, విధాన సంస్కరణలు, కొత్త ఉత్పత్తుల పరిచయం సోషల్ మీడియా వాడకం వంటి ఇటీవలి పోకడలను కూడా ఈ నివేదిక హైలైట్ చేస్తుంది. భారతదేశంలో పనిచేస్తున్న కొన్ని ప్రముఖ ఆటగాళ్ళు, వారి రచనలు, వారు అనుసరించిన ముఖ్య వ్యూహాలను కూడా ఇది చర్చిస్తుంది. మొత్తంమీద, నివేదికలో మార్కెట్ డ్రైవర్లు, సవాళ్లు, అవకాశాలు, భవిష్యత్ రోడ్‌మ్యాప్, పెట్టుబడి సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం నియంత్రణ పర్యావరణ వ్యవస్థ ఉన్నాయి.

రామప్ప పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

హైదరాబాద్ , జులై 22:రామప్ప ప్రాంత పరిరక్షణకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నిర్వహణ కమిటీని అదేవిధంగా స్థానిక స్థాయిలో పాలంపేట్ ప్రత్యేక అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేయడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం నగరంలోని రవీంద్ర భారతీలో గల మంత్రి కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రామప్పకు త్వరలోనే యునెస్కో గుర్తింపు లభించనున్నట్లు తెలిపారు. రామప్పకు యునెస్కో గుర్తింపు చివరి దశకు చేరిందన్నారు. ప్రభుత్వం చర్యల వల్లే యునెస్కో గుర్తింపు దక్కనుందన్నారు. యునెస్కో గుర్తింపు కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. రామప్ప సమీపంలోని రెండు ఆలయాలను కూడా రామప్ప ఆస్తి పరిధిలోకి తేనున్నట్లు మంత్రి వెల్లడించారు.

కపిలేశ్వరస్వామివారికి ఏకాంతంగా గ్రంథి పవిత్ర సమర్పణ



తిరుపతి, జులై 22::తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవాల్లో రెండో రోజైన గురువారం స్వామివారికి గ్రంథి పవిత్ర సమర్పణ జరిగింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఈ క